క్లుప్తంగా

కేసీఆర్ హయాంలోనే పాఠశాలలకు మహర్దశ



విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: కేసీఆర్ హయాంలోనే ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ అని, అనేక నిధులు కేటాయించి ఎంతో అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కొత్తవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు సంబు రాజేందర్ రెహాన్, మహీన్,సోనాక్షి, సరస్వతీలను అభినందించారు. గత ప్రభుత్వ హయాంలో మన బస్తీ మన బడిలో భాగంగా జగిత్యాల పట్టణంలో రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. పేద మధ్యతరగతి పిల్లల కోసం గురుకులాలు సైతం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రైల్వే వాకర్స్ ఆధ్వర్యంలో సంబరాలు



బాణాసంచా కాలుస్తున్న రైల్వే వాకర్స్

కోరుట్లటౌన్: భారత ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా రైల్వే వాకర్స్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బాణా సంచాలు కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే వాకర్స్ ప్రధాన కార్యదర్శి రాచమడుగు శ్రీనివాస్, తిప్పిరి గంగన్న, సతీశ్‌రావు, పొతుగంటి శ్రీనివాస్, రవీందర్, జమిందార్, బుజ్జి, బీఎస్‌రావు, రాజేశ్వర్‌రావు, తిరుమల్‌గౌడ్, నరేశ్, లింగమూర్తి, కిషన్‌గౌడ్, రాజు, గుణాకర్, మనోహర్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారుల ఆరా



పనులు పరిశీలిస్తున్న అధికారులు

పెగడపల్లి:మండలంలోని వివిధ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం అధికారులు పరిశీలించారు. నర్సింహునిపేట, ఆరవెల్లి, మద్దులపల్లి తదితర గ్రామాల పాఠశాలలను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ సందర్శించి పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల్లో పనులు పూర్తిచేసి విద్యార్థులకు సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

ప్రభుత్వ విప్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి గ్రామ రైతులు, కాంగ్రెస్ నాయకులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. గ్రామశివారులోని కొచ్చెరువు కట్ట గత వర్షాకాలం కోతకు గురై నీళ్లు వృథాగా వెళ్లిపోయాయి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ చూపి మరమ్మతుల కోసం రూ. 29 లక్షలు మంజూరు చేయించగా, ఇటీవల పనులు పూర్తయ్యాయి. దీంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కల్లెడ గంగాధర్, గోపిడి ధనుంజయ్‌రెడ్డి, బూస గంగారెడ్డి, జవ్వాజి చౌదరి, ఆకుల సంతోష్, రైతులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభం



ధర్మపురి: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ ఫిజియో తెరపీ క్లినిక్ సెంటర్‌ను సోమవారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. అదే విధంగా పట్టణంలో జగతి ప్లేస్కూల్‌ను సందర్శించి అదనంగా ఏర్పాటు చేసిన తరగతి గదులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఏడాది గడిచినా పునాదుల్లోనే..

- మూడు మాధ్యమాలు, 350 మంది విద్యార్థులు
- ముందుకు సాగని 'మన బస్తీ మన బడి'
- జగిత్యాల పట్టణ బాలికల ఉన్నత పాఠశాల పరిస్థితి



అసంపూర్తిగా బాలికల ఉన్నత పాఠశాల భవనం

జగిత్యాలటౌన్: పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం ప్రారంభించి ఏడాది గడిచినా పునాదులు దాటలేదు. మన బస్తీ మన బడి పథకం కింద గత ప్రభుత్వం ఏడాది క్రితం ప్రారంభించిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవన నిర్మాణం పునాదులు దాటి ముందుకు సాగడం లేదు. బడిబాట చేపట్టి కొత్త విద్యార్థులను చేర్చుకునేందుకు కార్యక్రమాలు రూపొందిస్తున్న అధికారులు, ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణంపై దృష్టి సారించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మన బస్తీ - మన బడిలో భాగంగా బాలికల ఉన్నత (పాత) పాఠశాలను కూల్చివేసి ఏడాది గడుస్తున్నా బేస్మెంట్ లెవల్ దాటడం లేదు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలతో 350కి పైగా ఉన్న విద్యార్థులు మరో బ్లాక్‌లో ఉన్న 5 తరగతి గదుల్లో సర్దుకోలేక విద్యార్థులు, సర్దుబాటు చేయలేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల మొత్తానికి ఒకటే బాత్‌రూం ఉండటంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతూ కాలం వెళ్లదీస్తుండగా, విద్యార్థులు, సిబ్బంది ఆరుబయటకే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మధ్యాహ్న భోజనం తయారు చేయడానికి షెడ్డు కూడా లేకపోవడంతో వంట ఎక్కడ చేయాలో తెలియక కార్మికులు సతమతమవుతున్నారు. బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ పనులు నిలిపివేయగా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం ప్రభుత్వ విద్యపై అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఉన్న బడిని కూల్చి వేసి నిల్వ నీడలేకుండా చేశారని అధికారులు, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేసేందుకు చొరవ చూపాలని లేని పక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా



ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నిర్మాణం నిలిచిపోవడంతో ఉన్న 5తరగతి గదుల్లో సర్దుకోలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– జగన్మోహన్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి జగిత్యాల

గ్రామాల్లో 'బడిబాట' ర్యాలీలు



బడిబాట ర్యాలీలో చిన్నారులు,అంగన్‌వాడీలు

పెగడపల్లి:బడీడు పిల్లలను సర్కార్ బడిలో చేర్పించాలని బడిబాటలో ఉపాధ్యాయులు కోరుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ఇంటింటికీ వెళ్లి బడీడు పిల్లలు, బడి బయట ఉన్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రులను కలిసి సర్కార్ బడుల్లో కల్పిస్తున్న వసతులను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లిలో సోమవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం రాజయ్య, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, దేవయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన విద్య

జగిత్యాలరూరల్: అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య బోధిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం అంగన్‌వాడీలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి బడిలో చేర్పించాలని అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు, పౌష్టికాహారం అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో వీవో అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జయప్రద, రాజమణి, పద్మజ, సునీత, జలజ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కోరుట్లటౌన్: ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు దయ్యరాజారాం సోమవారం తెలిపారు. స్థానిక సి.ప్రభాకర్ గ్రంథాలయంలో నూతన కార్యవర్గం ఎన్నిక ప్రకటించారు. అధ్యక్షుడిగా మగ్గిడి నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా ఎండీ ఫసియొద్దీన్, జనరల్ సెక్రటరీగా కుంచాల రామక్రిష్ణ, జాయింట్ సెక్రటరీగా జాజాల రమేశ్, ట్రెజరర్‌గా గుగ్గిల్ల రాజేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నీరటి రమణ, గౌరవ సభ్యులుగా చెన్న విశ్వనాథం, వోటారికారి శ్రీనివాస్, ఉమ, దీప, రమేష్, సత్యనారాయణ ఎన్నికై నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడి మగ్గిడి నర్సయ్య మాట్లాడుతూ అసోసియేషన్ ఐడియాలజీని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఐఎల్‌పీఏ రాష్ట్ర సభ్యురాలు మెడిచెలిమెల సుమలత పాల్గొన్నారు.

దేవాలయ భూమి సాగుకు వేలం

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస శ్రీ పౌలస్తేశ్వరస్వామి ఆలయానికి చెందిన వ్యవసాయ భూమిని ఏడాది పాటు సాగు చేసుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో రవికిషన్ గురువారం తెలిపారు. ఆలయానికి చెందిన సర్వేనంబరు 342/1లో 7.18 ఎకరాలు, సర్వేనంబరు 359 నుంచి 368 వరకు 18.30 ఎకరాల భూమిని ఈనెల 13న గురువారం ఉదయం 10 గంటలకు దేవాలయ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు 7.18 ఎకరాలకు రూ.50 వేల దరావత్, 18.30 ఎకరాల భూమికి రూ.25 వేల దరావత్ చెల్లించి పాల్గొనాలని సూచించారు.

ఖబరస్తాన్ కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు విన్నవిస్తున్న ముస్లింలు

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామ శివారులో సర్వే నెంబర్ 118లో 32 గుంటలు, సర్వే నెంబర్ 120లో 18 గుంటలు గల ముస్లిం శ్మశానవాటిక కబ్జాకు గురైందని యెఖీన్‌పూర్ ఖబరస్తాన్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకొని స్థలాన్ని యథావిధిగా తమకు అప్పగించాలని పిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖబరస్తాన్ ప్రొటెక్షన్ కమిటీ ప్రతినిధి మొహమ్మద్ ఫసియొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఖబరస్తాన్ హద్దులు చూపించాలి

ఇబ్రహీంపట్నం: ఖబ్రాస్తాన్ స్థలం కబ్జాకు గురి చేస్తున్నారని హద్దులు నిర్ణయించాలని సోమవారం ప్రజావాణిలో మండలంలోని బర్థీపూర్ గ్రామానికి చెందిన ముస్లింలు మాజీ సర్పంచ్ సంగం సాగర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రసాద్‌కు విన్నవించారు. సర్వేనంబర్ 203లో 40 ఏళ్లగా ఖబ్రాస్తాన్ ఉందని, దీని చుట్టూ ఉన్న రైతులు కబ్జా చేస్తున్నారని వెంటనే సర్వే చేయించి హద్దులు చూపించాలని విన్నవించారు.

మట్టి తవ్వకాలు అడ్డుకున్న గ్రామస్తులు



లారీని అడ్డుకున్న గ్రామస్తులు

కొండగట్టు: కొడిమ్యాల మండలం నమలికొండ శివారు గ్రామం గోపాలరావుపేటలోని జాఫర్‌ఖాన్ చెరువులో అక్రమ మట్టి తవ్వకాలను సోమవారం గ్రామ మత్స్యకార సభ్యులు, గ్రామ రైతులు, ప్రజలు అడ్డుకున్నారు. దీనిపై ఇంతకుముందే అధికారులకు ఫిర్యాదుచేసినా చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో నిరసనగా మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు.

నిరుపేదల ఇళ్ల స్థలాలు పరిశీలన



ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

మల్యాల: మండల కేంద్రంలోని శివారులో నిరుపేదలకు గతంలో కేటాయించిన ఇళ్ల స్థలాలను సోమవారం ఎంపీపీ ఆగంతపు రవళి, తహసీల్దార్ మునిందర్, సెక్రటరీ శ్రీకాంత్ పరిశీలించారు. రెండు దశాబ్దాల క్రితం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించినా, ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. కొంత మంది బేస్మెంట్ వరకు నిర్మించుకోగా మరికొంత మంది ఇళ్లు నిర్మించుకున్నారు. ఇందిరమ్మ పథకం కింద రూ.5లక్షలు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో ఇళ్ల నిర్మాణానికి సహకారం అందిస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు.

ఐఎల్‌పీఏ జిల్లా జాయింట్ సెక్రటరీగా రమేశ్



రమేశ్

ధర్మపురి: ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా జాయింట్ సెక్రటరీగా ధర్మపురి కోర్టు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది జాజాల రమేశ్‌ను నియమించినట్లు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ దయ్య రాజారాం, రాష్ట్ర మెంబర్ చలిమెల సుమలత తెలిపారు. కోరుట్ల పట్టణంలో జరిగిన సమావేశంలో నూతనంగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రమేశ్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా మల్లయ్య యాదవ్

పెగడపల్లి: యాదవ సంఘం పెగడపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా బైర మల్లయ్యయాదవ్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దాసరి మల్లయ్య, సంయుక్త కార్యదర్శిగా బైర రాయమల్లు, గౌరవ అధ్యక్షుడిగా బైర కొమురయ్యను ఎన్నుకున్నారు.

ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆవుకు జీవం



ఆవుకు వైద్యం చేస్తున్న పశువైద్యాధికారులు

జగిత్యాలరూరల్: ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆవుకు ఒక ఫోన్‌కాల్‌తో స్పందించి పశువైద్యాధికారులు దానికి జీవం పోసి స్థానికుల చేత శభాష్ అనిపించుకున్నారు. జగిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నుంచి గర్భంతో ఉన్న ఆవు ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. స్థానికంగా ఉన్న వేణు అనే వ్యక్తి సోమవారం ఫోన్ ద్వారా వెటర్నరీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన లక్ష్మీపూర్ లైవ్‌స్టాక్ అధికారి కందుకూరి పూర్ణచందర్, రిటైర్డ్ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ భూమయ్య సకాలంలో ఆవుకు వైద్యం అందించి రక్షించారు. దీంతో కౌన్సిలర్ పులి శ్రీధర్, వేణు, సూపరింటెండెంట్ గంగాధర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, మెకానిక్ లక్ష్మణ్ వైద్యులను అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సారంగాపూర్: బీఆర్ఎస్ యువజన విభాగం మండల నాయకుడు బింగి శ్రీనివాస్ (35) అనారోగ్యంతో సోమవారం మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించి శ్రీనివాస్ మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, నాయకులు ఉన్నారు.

'ప్రజావాణి' రెవెన్యూ అధికారులకే పరిమితమా?



ప్రజావాణిలో తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

కథలాపూర్: మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి తహసీల్దార్ ముంతాజిబొద్దిన్, రెవెన్యూ సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మొదటగా నిర్వహిస్తున్న ప్రజావాణి కావడంతో దరఖాస్తులు ఎక్కువగా వస్తాయని అధికారులు భావించారు. కేవలం భూమి సమస్యలపై రెండు దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

'మిషన్ భగీరథ' నల్లాలపై ఇంటింటి సర్వే



పెగడపల్లిలో సర్వే చేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం: మిషన్ భగీరథ నల్లాలపై ఇంటింటా సర్వే పనులను చేపడుతున్నారు. సోమవారం మండలంలోని అమ్మక్కపేటలో చేస్తున్న సర్వే పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి భగీరథ నల్లా కనెక్షన్ ఉందా, ఉంటే నల్లాల నుంచి నీళ్లు వస్తున్నాయా, రోజు ఎన్ని లీటర్లు వస్తున్నాయి, వివరాలు సేకరిస్తూ ఇంటి యాజమానిని నల్లా దగ్గర నిల్చోబెట్టి ఫోటో తీసుకొని వారి ఆధార్, ఫోన్ నంబర్లను నమోదు చేస్తున్నారు. మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో 12,176 ఇళ్లకు వెళ్లి వారం రోజుల్లో సర్వే పూర్తి చేసి వివరాలు నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, వీవోఏలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలో అమలవుతున్న మిషన్ భగీరథ తీరుపై సమగ్ర వివరాలు తెలుసుకునేందుకే ఇంటింటా సర్వే చేపట్టినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలో ఆరవెల్లి, నర్సింహునిపేట, మద్దులపల్లి గ్రామాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ సర్వేను ఎంపీవో మహేందర్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా 10681 కుటుంబాలకు నల్లా కనెక్షన్లున్నాయని, వారంలోపు సర్వే పూర్తి చేసి అధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోలు, కారోబార్లు పాల్గొంటున్నట్లు తెలిపారు.

ప్రధానోపాధ్యాయులకు సత్కారం



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

జగిత్యాల: జగిత్యాలలోని వీకేబీ ఫంక్షన్‌హాల్‌లో ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు, ఇటీవల పదవీ విరమణ పొందిన గెజిటెడ్ హెచ్‌ఎంలను సత్కరించారు. జగిత్యాలలోని గర్ల్స్ హైస్కూల్‌లో పనిచేస్తున్న బాలకృష్ణ ఇటీవల పదవీ విరమణ పొందగా ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్ సన్మానించారు. ప్రతి ఒక్క ఉద్యోగికి విరమణ ఉంటుందని, సేవతోనే తృప్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు, ఎంఈవో గాయత్రిదేవి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సారంగాపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు సోమవారం మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి భీమ్‌కుమార్ నేతృత్వంలో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను, గ్రామ పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాకారులు మహిపాల్, రాజేందర్, ప్రవీణ్, సురేష్‌నాయక్, అశోక్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంలు అందజేత

సారంగాపూర్: మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు విద్యార్థులకు అందించే యూనిఫాంలను సోమవారం ఎంఈవో వాసం భీమయ్య అందజేశారు. మండలంలోని 561 మంది బాలికలకు, 439 మంది బాలురకు వీటిని పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జ్యోతక్క జన్మదిన వేడుకలు

మెట్‌పల్లి: మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క జన్మదిన వేడుకలను పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రోళ్ల హన్మాండ్లు, బత్తుల లక్ష్మణ్, రైసుద్దీన్, లింగం, అజీమ్, ప్రణయ్, వంశీ, రాజేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మృతి

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముద్దం బాలయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడు బాలయ్య అనారోగ్యంతో బాధపడుతూ బొంబాయిలో తన కూతురు వద్ద మృతి చెందాడు. మంగళవారం ఎర్దండిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడి కుటుంబానికి జువ్వాడి నర్సింగరావు సానుభూతి తెలిపారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న గౌడ కులస్తులు

మెట్‌పల్లి: పట్టణంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని గౌడ కులస్తులు ఘనంగా జరుపుకుంటున్నారు. దీనిలో భాగంగా సోమవారం ప్రత్యేకంగా హోమం నిర్వహించారు. మంగళవారం బోనాల పండుగను జరుపనున్నట్లు సంఘం అధ్యక్షులు పూదరి సుధాకర్ తెలిపారు. ఇందులో కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూదరి నర్సాగౌడ్, పూదరి శ్యాం, పుల్లా చిన్నయ్య, చెర్లపల్లి రాజేశ్వర్, చెట్లపల్లి సుఖేందర్ తదితరులున్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయికల్: మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులంతా కలిసి సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు గంగారాం, రహీం, మురళీ, మనోహర్, శ్యామ్‌సుందర్‌లను ఘనంగా సన్మానించారు. చదువుకున్న సమయంలో తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.